31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

మంగళవారం,ఆగస్టు 11 ,2026 పేజీలు :

## వరుణ యాగాలు కాదు.. ప్రాజెక్టుల పూర్తి చేయండి

- తెలంగాణకు అన్యాయం జరుగుతున్నా కేంద్ర మంత్రి ఎందుకు ప్రశ్నించలేదు
- పాజెక్టుల నిర్మాణంలో జాప్యం చేస్తే ప్రజలు క్షమించరు
- మాజీ మంత్రి జీవన్ రెడ్డి



చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 10: వరుణ యాగాలు కాదు.. ప్రాజెక్టుల పూర్తి చేయాలని, తెలంగాణ కు అన్యాయం జరుగుతున్నా కేంద్ర మంత్రి ఎందుకు ప్రశ్నించ లేదని, ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం చేస్తే ప్రజలు క్షమించరని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో-మిగతా 2లో




# ప్రజాప్రతినిధులకు గౌరవం లేదా?

- మున్సిపాలిటీలో అధికారులు వర్సెస్ ప్రజాప్రతినిధులు
- కౌన్సిలర్ల ఆగ్రహం ఓడినా వారికి ప్రాధాన్యం ఇవ్వడం ఏమిటి..?
- అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల బహిరంగ విమర్శలు

చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 10 :జగిత్యాల మున్సిపాలిటీలో కొత్త పాలకవర్గం బాధ్యతలు చేపట్టి ఆరు నెలలు కూడా పూర్తి కాకుండానే అధికారులు ప్రజాప్రతినిధుల మధ్య విబేధాలు బయటపడ్డాయి. కౌన్సిలర్ల మాటకు విలువ ఇవ్వడం లేదని, వార్డుల్లో అభివృద్ధి పనులు జరగడం లేదని కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ఓటు వేసి గెలిపించినా.. వార్డులో ఏ సమస్య వచ్చినా ముందుగా కౌన్సిలర్లనే సంప్రదిస్తున్నారని, కానీ సమస్య పరిష్కారానికి మున్సిపల్ అధికారుల సహకారం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కౌన్సిలర్లు వాపోతున్నారు. వర్షాకాలం కావడంతో పారిశుద్ధ్య పనులు సరిగా జరకపోవడంతో దోమల తీవ్రత పెరగడంతో పట్టణ శివారు వార్డుల్లో వర్షపు నీరు నిలిచి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని, స్థానిక కౌన్సిలర్లు అధికారులకు ఎన్ని సార్లు విన్నవించిన అధికారులు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఫైళ్లు పెండింగ్...ప్రజలు పడిగాపులు....**

కొంతమంది కౌన్సిలర్లు మాట్లాడుతూ వార్డుల్లో ప్రతి రోజూ చెత్త సేకరించే చెత్త సేకరణ వాహనాలు ప్రతిరోజూ ఇంటింటా చెత్తను సేకరించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సిబ్బంది సరిగా రావడం లేదని, పనులు చేయాలంటే అధికారుల సహకరం అవసరమని పేర్కొంటున్నారు. ఎన్నికల సమయంలో తమను గెలిపిస్తే వార్డు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టి, వార్డును అభివృద్ధి చేస్తామని చెబితే వారు తమను గెలిపించారని, అధికారులు అలసత్వం, సమన్వయలోపం, సిబ్బంది కొరతతో గెలిచిన 6 నెలల్లోనే ఓట్లు వేసి గెలిపించిన వార్డు ప్రజల -మిగతా 2లో

## కమలాపూర్‌లో రాజకీయ వేడి

### మంత్రుల సమక్షంలో "కౌశిక్" హల్ చల్





(కోరెం సుధాకర్ రెడ్డి చురకలు ప్రతినిధి హుజురాబాద్)

మరోసారి హుజురాబాద్ నియోజకవర్గం రాజకీయ వివాదానికి వేదికైంది. సోమవారం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ కమలాపూర్ మండల కేంద్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేదికపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రసంగిస్తుండగా.. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అడ్డుకునే ప్రయత్నం చేశారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వంపై పార్టీపై అలాగే కెసిఆర్ పై విమర్శలు చేయడం తగదని అన్నారు. రాజకీయ వేదిక కాదని ఇక్కడ ప్రజలకు వాస్తవాలను మాత్రమే చెప్పాలని ఆయన స్పష్టం చేశారు. కమలాపూర్ లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను తమ ప్రభుత్వమే నిర్మించిందని కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. దీంతో ఇద్దరి మధ్య కొద్దిసేపు వివాదం జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్ కలుగజేసుకొని ఇద్దరిని వారించారు. దీంతో వివాదం సద్దు మణిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ బి ఆర్ ఎస్ నాయకులు నినాదాలతో హోరెత్తించారు. కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది.

**వ్యూహాత్మకంగా వ్యవహరించిన కౌశిక్?**

కమలాపూర్‌లో జరిగిన-మిగతా 2లో

## మంత్రుల సమక్షంలో "కౌశిక్" హల్‌చల్

### ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం మంత్రి శ్రీధర్ బాబు





**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఆగస్టు 10.** మంథని నియోజకవర్గంలోని కాటారం మండల పరిషత్ కార్యాలయంలో కాటారం, మహాదేవపూర్, మలహర్రావు, పలిమెలకు సంబంధించిన 240 కల్యాణ లక్ష్మి మరియు సీఎంఆర్ఎఫ్ చెక్కులను రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా చెక్కులను అందజేశారు.లిఈ సంద ర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడు తూ...పేద, మధ్యతరగతి కుటుంబా లకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని అన్నారు. ఆడపిల్లల వివాహం తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకుండా కల్యాణలక్ష్మి -మిగతా 2లో

## ఆస్తి కోసం వేధింపులు..

### మెట్‌పల్లిలో మహిళ ఆత్మహత్య



**చురకలు విలేకరి,మెట్‌పల్లి, ఆగస్టు 10 :** ఆస్తి కోసం చెల్లెలు, బావ వేధించడంతో వేధింపులు తట్టుకోలేక ఓ మహిళ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెట్‌పల్లి పట్టణ శివారులోని రేగుంటలో వెలుగుచూసింది. పోలీసుల తెలిపిన వివరాలు ప్రకారం కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం కిస్టాపూర్ గ్రామానికి చెందిన వీరమణి (40) భర్త, కుమారుడు గతంలోనే చనిపోవడంతో ఆమె ఒంటరిగా ఉంటోంది. దీంతో ఆమె బాగోగులు చూసుకుంటామని నమ్మించి, ఆమె చెల్లెలు గంగమణి, బావ జక్కం రాజు వీరమణిని మెట్‌పల్లికి తీసుకువచ్చారు. అయితే, కొంతకాలంగా వీరమణికి చెందిన ఆస్తిని తమ పేరిట రాయాలంటూ వారిద్దరూ ఆమెను తీవ్రంగా వేధించడం ప్రారంభించారు.?ఈ క్రమంలో ఈనెల 8న వీరి మధ్య గొడవ జరగడంతో వీరమణి ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయింది. భార్య కనిపించడం లేదంటూ జక్కం రాజు ఈనెల 9న పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. అనంతరం పోలీసులు గాలింపు చేపడుతుండగా, ఈనెల 10న మెట్‌పల్లి శివారులోని రేగుంటలో జక్కం రాజు వ్యవసాయ బావిలో వీరమణి మృతదేహం లభ్యమైంది.?బావ జక్కం రాజు, చెల్లెలు గంగమణి ఆస్తి కోసం చేసిన వేధింపులు తాళలేకే తన అక్క ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తమ్ముడు తోట బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు మెట్‌పల్లి ఎస్ఐ పి. కిరణ్ కుమార్ తెలిపారు.

## మంత్రుల సమక్షంలో "కౌశిక్" హల్‌చల్

**మొదటి పేజీ తరువాయి....** పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్ ) ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు.ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ పథకాల ద్వారా అందుతున్న ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు

# ప్రజాప్రతినిధులకు గౌరవం లేదా?

**మొదటి పేజీ తరువాయి....** నుండి కౌన్సిలర్లకు వ్యతిరేకత ఎదురవుతోందని వాపోతున్నారు. మోటేషన్లు, భవన నిర్మాణ అనుమతులు నెలల తరబడి పెండింగ్లో పెట్టడంతో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని ఆరోపించారు.

మమ్మల్ని ప్రజలు ఎలా నమ్ముతారు?.... ప్రజలు మమ్మల్ని నమ్మి గెలిపిస్తే, మా మాటకు అధికారులు విలువ ఇవ్వడం లేదు. ఫైళ్లపై సంతకాలు చేయడం లేదని, ఇలా అయితే ప్రజలు మమ్మల్ని ఎలా విశ్వసిస్తారని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం సహకరించకపోవడంతో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడం కష్టంగా ఉందన్నారు.

మైనార్టీ వార్డుల్లో వివక్ష....
మైనార్టీ వార్డుల నుంచి ఎన్నికైన కొందరు కౌన్సిలర్లు తమకు మున్సిపల్ అధికారులు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. ఎన్నికల్లో తమపై పోటీ చేసి ఓడిపోయిన అధికార పార్టీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తున్నారని, అధికారులు వారి సూచనలనే పాటిస్తున్నారని ఆరోపిస్తున్నారు. పలు వార్డుల్లో గెలిచిన స్వతంత్ర అభ్యర్థులకు అధికారులు సహకరించడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. అధికార పార్టీ కౌన్సిలర్లు లేని వార్డుల్లో అధికార పార్టీ నుండి పోటీ చేసి ఓడిన అభ్యర్థులకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వడంపై స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచిన కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఎలక్ట్రిక్ వాహనాల కేటాయింపులో పక్షపాతం....?**
వార్డులకు కేటాయించిన ఎలక్ట్రిక్ వాహనాల కేటాయింపు విషయంలోనూ పక్షపాతం ఉందని పలు వార్డు కౌన్సిలర్లు మండిపడుతున్నారు. తాము ప్రతిపాదించిన వారికి కాకుండా, తమపై పోటీ చేసిన ఓడిపోయిన అభ్యర్థులు సూచించిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు.

**రాజీనామాల బాటలో కౌన్సిలర్లు?.....**
అధికారులు సహకరించకపోతే కౌన్సిలర్ గా కొనసాగి ప్రయోజనం ఏమిటని కొందరు కౌన్సిలర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. సమస్య పరిష్కరించే అధికారం లేకుండా పదవిలో ఉండి ఏం ప్రయోజనం అంటూ రాజీనామా చేయాలనే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. ఇటీవలే ఓ వార్డులో జరిగిన సంఘటనలో ఓ కౌన్సిలర్ మున్సిపల్ అధికారులు తన మాట వినడం లేదని అలాంటి సందర్భంలో తాను కౌన్సిలర్ ఎందుకు కొనసాగాలని, తాను రాజీనామా చేస్తానని రాజీనామా పత్రంలో మున్సిపల్ కార్యాలయానికి వెళ్తే చైర్పర్సన్ కలుగజేసుకొని రాజీనామా పత్రాన్ని చించివేసినట్లు తెలిసింది. పాలకవర్గం ఒక వైపు, అధికారులు మరో వైపు ఉండటంతో మధ్యలో ప్రజలే ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలలకే మున్సిపాలిటీలో ఇంత అంతర్గత అసంతృప్తి రావడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొంటున్నారు.

# వరుణ యాగాలు కాదు.. ప్రాజెక్టులు పూర్తి చేయండి

**మొదటి పేజీ తరువాయి...**మాజీ మంత్రి, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో వచ్చే పరిణామాలపై గత 6 నెలలుగా హెచ్చరిస్తున్నా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పుడు వరుణ యాగాలు చేస్తుండడం విస్మయం కలిగిస్తోందన్నారు. అదృష్టవశాత్తు ఇటీవల వర్షాలతో శ్రీశైలం ప్రాజెక్ట్ ఫుల్ ట్యాంక్ లెవల్ నిండినా, ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవడం లేదన్నారు. శ్రీశైలంలో పవర్ జనరేట్ చేసిన నీరు నాగార్జునసాగర్‌కు వెళ్తోందని, పోతిరెడ్డిపాడు నుంచి 50,000 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారని తెలిపారు. నిత్యం లక్ష క్యూసెక్కుల నీరు అంటే దాదాపు 9 టీఎంసీల నీరు వస్తున్నా అన్నారం, సుందిళ్లను వినియోగించుకోవాలనే ఆలోచన లేదన్నారు. తుమ్మడిహెట్టి నుంచి నీరు వచ్చినా సుందిళ్ల వినియోగం తప్పనిసరని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి 30 నెలలుగా నిద్రపోయారని, మహారాష్ట్రతో చర్చలు చేయాల్సి ఉంటే ఇప్పటివరకు ఏం చేశారని ప్రశ్నించారు. తుమ్మడిహెట్టి నిర్మాణం చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి 3 బడ్జెట్లు గడిచిపోయాయన్నారు. కన్నెపల్లి నుంచి కాపర్ డ్యాం నిర్మించి నీటిని ఎత్తిపోస్తే రివర్స్ పంపింగ్ ద్వారా శ్రీరామసాగర్ వరకు వెళ్తుందన్నారు. ఆగస్టు 5న రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి సి.ఆర్.పాటిల్‌ను కలిశారని, కానీ తెలంగాణకు అన్యాయం జరుగుతుందని ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. గతంలో ఆమోదం పొందిన ప్రాజెక్టులను పునఃపరిశీలించే అవకాశం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ సిడబ్ల్యూసి ఆమోదం పొందిందని, చిన్న కాళేశ్వరం 4.5 టీఎంసీ ప్రాజెక్టును 2022లో కేసీఆర్ ఆమోదించి నిర్మాణం పూర్తి చేశారని గుర్తు చేశారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ 2024లో అనుమతి పొందిందన్నారు. తుమ్మడిహెట్టి వద్ద 152 మీటర్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని వినతిపత్రం ఇచ్చామన్నారు. తుమ్మడిహెట్టి వద్ద పొందలేని నీటిని కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా 240 టీఎంసీ నీళ్లు పొందేలా హక్కులు సాధించింది కేసీఆర్ అని అన్నారు. ఫసల్ బీమా యోజనలో 25 శాతం ప్రీమియం కేంద్రం, రాష్ట్రం చెల్లించాలని, మిగిలినది రైతులు చెల్లిస్తారని, దాన్ని అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఎన్నికల్లో రైతులు చెల్లించే ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కేసీఆర్ రైతుబంధు ప్రవేశపెట్టి రైతు కుటుంబాలను ఆదుకున్నారన్నారు. అన్నారం, సుందిళ్ల సీపేజ్ పనులు చేపట్టకుండా 2 ఏళ్లు గడిపారని ఆరోపించారు. సీపేజ్‌కు 100 కోట్లు, కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద కాపర్ డ్యాంకు 100 కోట్లు కేటాయిస్తే ఎల్ నినో ప్రభావాన్ని తట్టుకోవచ్చన్నారు. యాగాలు మంచివే, కానీ మానవ ప్రయత్నం చేయకుండా యాగాలు చేస్తే ఎలా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ చేతులెత్తేశారని, ఇక ప్రభుత్వ పాలనను దేవుడే చూసుకోవాల్సి వస్తుందన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం చేస్తే ప్రజలు క్షమించరని హెచ్చరించారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆయిల్నేని వెంకటేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ జీనత్ పర్వీన్ మున్నా, కల్లెపెల్లి దుర్గయ్య, సామల రాజశేఖర్, తోట హరీష్, శీలం ప్రవీణ్, రాధాకిషన్, ముకస్సర్ అలీ నేహాల్, సాయికుమార్, స్వామిరెడ్డి, గుండా మధుసూదన్, రాగుల రాజు, సన్నిత్ రావు, గంగిపెల్లి వేణు, అతవుల్ల, నక్క జీవన్, అభి, హరి తదితరులు పాల్గొన్నారు.

# కమలాపూర్‌లో రాజకీయ వేడి

**మొదటి పేజీ తరువాయి...** సభలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ల ఎదుట ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరించారు. కౌశిక్ సహజంగానే ఆవేశం కలిగిన ఎమ్మెల్యే. ఆయన ఏది మాట్లాడినా వివాదం జరుగుతుంది. అయితే కౌశిక్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు గత ప్రభుత్వం పై చేసిన విమర్శలను కౌశిక్ రెడ్డి వేదికపైనే అడ్డుకున్నారు. ఆయన సున్నితంగానే ఆ సందర్భంగా వ్యవహరించారు. వేదికపై మంత్రులను నెట్టివేయడం గాని గొడవ గాని జరిగితే అదంతా కౌశిక్ రెడ్డి వల్లనే జరిగిందనే ప్రచారం జరిగేది. అభివృద్ధి కార్యక్రమంలో కౌశిక్ దురుసుగా వ్యవహరించాడని, అడ్డుకున్నాడని ప్రచారం జరిగేది. తద్వారా కౌశిక్ రెడ్డి క్యారెక్టర్ ను దెబ్బతీసే ప్రయత్నం జరిగేది. కానీ ఇలాంటివి ఏవి జరగకుండా కౌశిక్ రెడ్డి జాగ్రత్త పడ్డారు. ఆయన తన పరిధిలోని వేదికపైనే మంత్రులను ప్రశ్నించే ప్రయత్నం చేశారు. కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలు దురుసుగా ప్రవర్తించినప్పటికీ ఆయన సంయమనం ప్రదర్శించారు. దీంతో సమస్య సద్దుమణిగింది. గతంలో వీణవంకలో సమ్మక్క జాతర సందర్భంగా జరిగిన సంఘటనలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి దాడి చేశారన్నట్టుగా.. చిత్రీకరణ జరిగింది. ఇది ఆయనకు కొంతమేర మునిసిపల్ ఎన్నికల సమయంలో నష్టం కలిగించిందన్న అభిప్రాయం ఆ సమయంలో వ్యక్తం అయింది. అప్పటినుండి కౌశిక్ రెడ్డి ఇలాంటి సంఘటనల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తగ్గిస్తున్నారు.

**ఉప్పల్ ను మండలం గా ఏర్పాటు చేయాలి : కౌశిక్**
కమలాపూర్ మండలంలోని ఉప్పల్ ను ప్రత్యేక మండలం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మంత్రులను కోరారు. మండలం ఏర్పాటు చేసేందుకు అన్ని రకాల అర్హతలు ఉన్నాయని స్పష్టం చేశారు. కమలాపూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆధునికరణకు రెండు కోట్ల రూపాయలు కేటాయించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ను కోరారు. అలాగే కమలాపూర్ లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కాలనీలో మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలు ఎన్నికల్లో ఇచ్చిందని వాటిని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కమలాపూర్ లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కెసిఆర్ ఆధ్వర్యంలోని బి ఆర్ ఎస్ ప్రభుత్వమే నిర్మించిందని ఆయన స్పష్టం చేశారు.

**ఇళ్లను నేనే ఇప్పించాను: ప్రణవ్**
కమలాపూర్ లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను తానే ఇప్పించానని కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తానే మంత్రులతో మాట్లాడి ప్రోగ్రాం ఫిక్స్ చేసినట్టు తెలిపారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయించినట్టు తెలిపారు.

## జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎలుక కమలాకర్



**చురకలు విలేకరి, మల్లాపూర్, ఆగస్టు 10 :** ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎలుక కమలాకర్ ను నియమకం చేస్తూ ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మగ్గిడి వెంకట నరసయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం మెట్ పల్లి పట్టణంలో ఎలుక కమలాకర్ కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తూనే యువజన సంఘం బలోపేతానికి పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎలుక కమలాకర్ మాట్లాడుతూ తన నియమకానికి సహకరించిన జాతీయ ఉపాధ్యక్షుడు మగ్గిడి వెంకట్ నరసయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్క మోహన్,రాష్ట్ర కార్యదర్శి నేరెళ్ల శ్రీధర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పెంటపర్తి అశోక్,మెట్పల్లి డివిజన్ కమిటీ నాయకులు తుక్కరామ్, కోరుట్ల డివిజన్ అధ్యక్షులు శోభన్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## అంజన్నను దర్శించుకున్న ప్రముఖ గాయని మంగ్లీ



**చురకలు విలేకరి, మల్యాల, ఆగస్టు 10 :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామివారిని ప్రముఖ జానపద, సినీ గాయని మంగ్లీ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంగ్లీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు ఆమెకు ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు. మంగ్లీ కొండగట్టు అంజన్నను దర్శించుకున్న విషయం తెలుసుకున్న అభిమానులు ఆమెను చూసేందుకు ఆసక్తి చూపించారు. కాగా కొద్దిరోజులుగా గాయని మంగ్లీ (సత్యవతి) ఆర్థిక కుంభకోణాల ఆరోపణలు, వివాదాస్పద పాటల ప్రదర్శనలు, సోషల్ మీడియా ట్రోలింగ్‌లతో వరుస వివాదాలలో చిక్కుకున్నారు. గోకులనందన ఇన్ఫ్రా సంస్థకు సంబంధించిన లావాదేవీలు, బోనాల పాటల వివాదాలు ఆమెను నిత్యం వార్తల్లో నిలిచేలా చేశాయి. ఈ నేపథ్యంలో గాయని మంగ్లీ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామిని దర్శించుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# ఉమర్ మస్జిద్ ఖబ్రస్తాన్‌లో పనిచేయని హైమాస్ట్ లైట్లు

**-పట్టించుకోని కౌన్సిలర్, మున్సిపల్ కమిషనర్**

**-తీవ్రంగా ఖండించిన ఎంఐఎం వార్డు ఇన్‌చార్జ్ : అబ్దుల్ రహీం**



**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఆగస్టు 10 :** కోరుట్ల పట్టణంలోని 4వ వార్డు మోమిన్‌పురలో ఉన్న మస్జిద్-ఏ-ఉమర్ పరిధిలోని విశాలమైన ముస్లిం ఖబ్రస్తాన్ (బడా తకియా)లో హైమాస్ట్ లైట్లు పనిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంఐఎం 4వ వార్డు ఇన్‌చార్జ్ అబ్దుల్ రహీం ఆవేదన వ్యక్తం చేశారు. ఖబ్రస్తాన్ లో స్ట్రీట్ లైట్లతో పాటు సుమారు 12 హైమాస్ట్ లైట్లు ఉండగా, వాటిలో చాలా కాలంగా లైట్లు పని చేయడం లేదని తెలిపారు.రాత్రి వేళల్లో ముస్లిం మృతుల అంత్యక్రియలకు ఖబ్రస్తాన్‌కు వచ్చే ప్రజలు చీకటి కారణంగా తీవ్రఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఖబ్రస్తాన్ ఆవరణలో పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోయాయని,దీంతో పాములు, విషపురుగుల భయంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు.ఈ సమస్యను వార్డు కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి స్పందన లేదని అబ్దుల్ రహీం ఆరోపించారు.ఎంఐఎం పట్టణ అధ్యక్షులు ఎం.ఏ.రఫీ ఆదేశాల మేరకు తాను స్వయంగా మున్సిపల్ కమిషనర్‌ను సంప్రదించి సమస్యను వివరించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు.ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కరించాల్సిన బాధ్యత కలిగిన కౌన్సిలర్, మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అబ్దుల్ రహీం అన్నారు.ఇది కేవలం ఒక వార్డుకు సంబంధించిన సమస్య కాదని, కోరుట్ల పట్టణంలోని ముస్లిం సమాజం ఎదుర్కొంటున్న సమస్యగా అధికారులు గుర్తించాలని కోరారు.ఇకనైనా అధికారులు స్పందించి ఖబ్రిస్తాన్‌లో పనిచేయని హైమాస్ట్ లైట్లను వెంటనే మరమ్మతు చేయడంతో పాటు ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం కొనసాగిస్తే,ఎంఐఎం పట్టణ అధ్యక్షులు ఎం.ఏ.రఫీ నాయకత్వంలో తన ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని అబ్దుల్ రహీం హెచ్చరించారు.

# అవగాహన పెంచుకో.. ఆసరా అందుకో...






**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 10 :** దేశంలోని అసంఘీటిత కార్మికులకు వృద్ధాప్యంలో సంక్షేమానికి కేంద్రప్రభుత్వం చర్యలు చేపడుతోంది. వారికి ఆర్థిక భరోసా కల్పించేలా రెండు పథకాలను అమలు చేస్తోంది.అవే ప్రధాన మంత్రి శ్రమ యోగి మాన్ ధన్ యోజన(పి ఎం ఎస్ వై ఎం),ప్రధాన మంత్రి జాతీయ పింఛన్ పథకం (పి ఎం ఎన్ పి ఎస్)అయితే వీటి పై అవగాహన లేక సద్వినియోగం చేసుకోలేక పోతున్నారని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరిఅశోక్ కుమార్ వృద్ధ కార్మికుల సమాచారం కోసం ఇలా వివరించారు.

**ఏ పథకం ఎవరికంటే...**

**పిఎంఎస్‌వైఎం :-** భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలు,రిక్షా తొక్కే వారు,మధ్యాహ్న భోజన నిర్వాహకులు, ఇటుక బట్టీల్లో పని చేసే వారు,చేనేత కార్మికులు, చర్మకారులు, ఇతర చేతి వృత్తులవారు. పి. ఎం. ఎస్. పి ఎస్ :-స్వయం ఉపాధి పొందే వారు,దుకాణ దారులు,ఆయిల్ మిల్లు, వర్క్ షాప్ నిర్వాహకులు,రిటైల్ వ్యాపారులు,చిన్న హోటల్లు నడిపెంచే వారు.జిల్లా లో మొత్తం అసంగిటిత రంగ కార్మికులు 1.18 లక్షల మంది ఉండగా,ఈ పథకాల్లో చేరింది కేవలం16 వేల మంది మాత్రమే. ఈ పథకాల్లో చేరే కార్మికులు వయసు ఆధారంగా నెలకు రూ. 55 నుంచి రూ. 200 వరకు ప్రీమియం చెల్లించాలి.ఎంత కట్టారో ఆదనంగా అంతే మొత్తం కేంద్ర ప్రభుత్వం జమ చేస్తుంది.18 నుంచి 40 ఏళ్ల లోపు అసంఘీటిత కార్మికులు పథకాల్లో చేరేందుకు అర్హులు. లబ్ధిదారులకు 60 ఏళ్ళు దాటిన తరువాత నెలకు రూ. 3 వేలు చెల్లిస్తారు.మరణాంతరం జీవిత భాగస్వామికి 50శాతం చెల్లిస్తారు. ప్రీమియం కడుతున్న లబ్ధిదారులు చని పోతే వారి జీవిత బాగస్వాములు సభ్యులుగా కొనసాగవచ్చు.ఈ పథకాలను సద్వినియోగం చేసువాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ లో కార్మికులను కోరారు.

# ఆర్టీసీ డ్రైవర్ కు రూ.50 లక్షల చెక్కు అందజేత



**చురకలు విలేకరి, కోరుట్ల, ఆగస్టు 10 :** రోడ్డు ప్రమాదంలో కుడి కాలు కోల్పోయిన ఆర్టీసీ డ్రైవర్ ఎం.డి. మాదర్ కు ఆర్టీసీ యాజమాన్యం అండగా నిలిచింది. యూబీఐ పథకం కింద ప్రమాద బీమా పరిహారంగా రూ.50 లక్షల చెక్కును అందజేసింది. కోరుట్ల ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ ఎం.డి. మాదర్ 2025 అక్టోబర్ 9న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తన కుడి కాలును కోల్పోయారు. ఈ నేపథ్యంలో యూబీఐ పథకం కింద లభించిన ప్రమాద బీమా ప్రయోజనంలో భాగంగా ఆర్టీసీ యాజమాన్యం రూ.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించింది. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి, యూపీఐ బ్యాంక్ సీజీఎం ఎం. రవీంద్రబాబు, డీజీఎం ఎస్. సత్యనారాయణ బాబి, ఏజీఎం రంజన్ కుమార్ మిశ్రా ఆధ్వర్యంలో బాధిత డ్రైవర్ ఎం.డి. మాదర్కు రూ.50 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి ఆర్టీసీ యాజమాన్యం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ప్రమాదంలో కాలు కోల్పోయిన తనకు యూబీఐ పథకం ద్వారా రూ.50 లక్షల ఆర్థిక సహాయం అందించిన ఆర్టీసీ యాజమాన్యానికి డ్రైవర్ ఎం.డి. మాదర్, ఆయన కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు పి. సోలోమన్, సిహెచ్. వెంకన్న, ఎం. రాజశేఖర్, కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి. రాజు, కోరుట్ల డిపో మేనేజర్ ఎస్. మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇళ్ళు ఇచ్చే బాధ్యత తీసుకుంటా

**-చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**



**చురకలు విలేకరి, కొడిమ్యాల, ఆగస్టు 10 :** ప్రజా ప్రభుత్వంలో నిరు పేద ఇళ్ళులేని ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ళు ఇప్పించే బాధ్యత తీసుకుంటామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. సోమవారం కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన ఔదరి లక్ష్మి కి మొదటి విడతలో ఇళ్ళు మంజూరై కొన్ని సాంకేతిక కారణాల వాళ్ళ మంజూరీ ఆలస్యం అయిన నేపథ్యంలో ప్రత్యేక చొరవ తీసుకోని ఇందిరమ్మ ఇళ్ళు మంజూరీ చేయించి ప్రొసీడింగ పత్రాలను లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందించారు. మొదటి విడతలో మండలంలో 450 ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేశామని, రెండవ విడతలో మరిన్ని ఇండ్లు త్వరలో మంజూరు చేస్తామని, రానున్న మూడేళ్లలో చొప్పదండిలో గుడిసెలేని నియోజక వర్గంగా తీర్చిదిద్దడమే ప్రధాన ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి ప్యాక్స్‌చైర్మెన్ మెన్నేని రాజనర్సింగ రావు,మండల కాంగ్రెస్ అధ్యక్షులు గోగురి భూషణ్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు చిలువేరీ నారాయణ గౌడ్, ఏఎంసి వైస్ చైర్మన్ కొండూరి రాజేష్, సర్పంచ్లు నేరెళ్ల మహేష్, మాజీ ఎంపీపీ పర్లపల్లి ప్రసాద్,సింగిరెడ్డి తిరుపతి రెడ్డి,వార్డు సభ్యులు రాపర్తి నర్సింగరావు, నాయకులు గుర్రం ప్రవీణ్, యూత్ కాంగ్రెస్ నాయకులు ముత్యం శంకర్, గోల్కొండ రాజు,చింటు,కవ్వం మధు, సోవు వెంకీ,నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి నుండి సస్పెండ్

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 10 :** జగిత్యాల జిల్లాలో సిఎంఆర్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచడం, బకాయిలు చెల్లించకపోవడంతో బిజెపి నాయకులు కొండ లక్ష్మణ్ పై కేసు నమోదు కావడంతో జిల్లా బిజెపి అధ్యక్షుడు రాజకొండ యాదగిరి బాబు క్రమశిక్షణ చర్యలు చేపట్టారు. సోమవారం కొండ లక్ష్మణ్ ను బిజెపి పార్టీ నుండి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కొండ లక్ష్మణ్ వ్యక్తిగత వ్యాపారాలతో బిజెపి పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు.

## ఒకే కాన్పులో ముగ్గురుపిల్లలకు జన్మనిచ్చిన తల్లి



**చురకలు విలేకరి, మెట్‌పల్లి, ఆగస్టు 10 :** మండలంలోని రాజేశ్వర్ రావుపేట గ్రామానికి చెందిన జంగిటి రాజలక్ష్మి-నరేందర్ దంపతుల ఇంట్లో పండగ వాతావరణం నెలకొంది. డెలివరీ నిమిత్తం సోమవారం మెట్‌పల్లి పట్టణంలోని మిషన్ ఆస్పత్రిలో చేరిన రాజలక్ష్మి,ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది.వైద్యుల పర్యవేక్షణలో జరిగిన ఈప్రసవంలో రాజలక్ష్మి ఒక మగబిడ్డ ,ఇద్దరు ఆడపిల్లలకు జన్మనిచ్చినట్లు వైద్యులు తెలిపారు.జన్మించిన వారిలో మగబిడ్డ 1కేజీ 800గ్రాములు ఇద్దరు ఆడపిల్లలు ఒక్కొక్కరు 1కేజీ500 గ్రాముల బరువుజన్మించారు.ప్రస్తుతం తల్లితోపాటు ముగ్గురు పిల్లలు ఆరోగ్యంగా ఉన్నారని, వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.ఒకేసారి ముగ్గురు పిల్లలు జన్మించడంతో ఆ కుటుంబంలోనూ ,రాజేశ్వరరావుపేట గ్రామంలో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి.

## ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**-పెన్షనర్ల రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్**



**చురకలు విలేకరి, జగిత్యాల, ఆగస్టు 10 :** ఉద్యోగులకు, పెన్షనర్ల కు ఇచ్చిన హామీలు అమలు చేయాలని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం జిల్లా కేంద్రంలో అసోసియేషన్ జిల్లా స్థాయి సమావేశం జరిగింది.జిల్లా ప్రధాన కార్యదర్శి పి. సి. హన్మంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం పై ఒక్క పైసా భారం పడని డిమాండ్స్ ను సైతం సర్కారు పట్టించుకోక పోవడం శోచనీయమన్నారు.ఆగస్టు 15వ తేదీ లోగా నూతన హెల్త్ కార్డుల జారీ, పీ. ఆర్. సి. ప్రకటించడం తో సహా తమ వినతులపై నిర్ణయం ప్రకటించక పోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని తమ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గాజుల నర్సయ్య ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నిర్ణయించినట్లు పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.హన్మంత్ రెడ్డి,కోశాధికారి గౌరిశెట్టివిశ్వనాథం, ఉపాధ్యక్షులు వెల్ముల ప్రకాష్ రావు, జిల్లా నేతలు పి. అశోక్ రావు,బొల్లం విజయ్, పబ్బా శివానందం,కుందేళ్ల మురళి,జిల్లా, డివిజన్,మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జీతం అడిగినందుకు దాడి..
## యువకుడి ఆత్మహత్య...

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 10 :** జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఓ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న గడ్డం గంగారెడ్డి ని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల రూరల్ మండలంలోని వెల్దుర్తికి చెందిన మృతుడు బందెల రమేష్ (38) ట్రాక్టర్ డ్రైవర్గా గడ్డం గంగారెడ్డి వద్ద పని చేస్తున్నాడని,బందెల రమేష్ తనకు రావాల్సిన జీతం డబ్బులు అడుగుతూ వాట్సాప్ మెసేజ్ చేయడంతో వివాదం తలెత్తిందని తెలిపారు. ఆదివారం గంగారెడ్డి,అతని స్నేహితుడు అజయ్ కలిసి రమేష్ ఇంటికి వెళ్లి దుర్భాషలాడుతూ రమేష్ను బెల్ట్ కొట్టగా, రమేష్కు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లి అతని మొబైల్ ఫోన్ లాక్కున్నారని తెలిపారు. అదే రోజు సాయంత్రం రమేష్ తనపై దాడి చేయడంతో మనస్థాపం చెంది ఇంట్లో ఉరివేసుకున్నాడని తెలిపారు. సోమవారం గంగారెడ్డిని పోలీసులు అరెస్టు చేసి 2 మొబైల్ ఫోన్లు, ఆక్టివా స్కూటీ, బెల్ట్ స్వాధీనం చేసుకున్నారు. ఏ-2 అజయ్ పరారీలో ఉన్నాడని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# వెల్గటూర్‌లో మిషన్ భగీరథ పైపులైన్ పనుల ప్రారంభం

**-రూ.5 లక్షల ఎస్ఎఫ్ నిధులతో పనులు**
**-ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం**



**చురకలు విలేకరి, వెల్గటూర్, ఆగస్టు 10 :** మండల కేంద్రంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా మిషన్ భగీరథ పైపులైన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ (ఎస్ఎఫ్) కింద మంజూరైన రూ.5 లక్షల నిధులతో చేపట్టనున్న పనులను స్థానిక సర్పంచ్ బండమీది కవిత సోమవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడటమే లక్ష్యంగా పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. నూతన పైపులైన్ ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ల పోరం మండల అధ్యక్షుడు గంద్ర ప్రతాప్ రావు, మాజీ సర్పంచ్ మెరుగు మురళీ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గంద్ర శ్రీకాంత్ రావు, జిల్లా అధికార ప్రతినిధి గుండాటి సందీప్ రెడ్డి, బి సి సెల్ మండల అధ్యక్షుడు బందెల ఉదయ్ గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ మెరుగు నరేష్ గౌడ్, వార్డు సభ్యులు నక్క-సురేష్, గుమ్ముల లక్ష్మీ, నాయకులు గోపి, గుమ్ముల వెంకటేశ్, వెలగందుల సంతోష్, గుమ్ముల అజయ్, బుసర్తి గంగారం, మిషన్ భగీరథ ఏఈ సాయి, కారోబార్లు పంబాల సతీశ్, లకుమల్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

# స్కానింగ్ దోపిడీ...చట్టవిరుద్ధంగా వైద్య పరీక్షలు

**-అనుమతులు లేకుండానే స్కానింగ్ సెంటర్ల నిర్వహణ...?**
**-నిర్దేశిత ఫీజుల కంటే ఎక్కువ వసూళ్లు**
**-పట్టించుకోని వైద్యారోగ్య శాఖ అధికారులు**





**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 10 :** జగిత్యాల జిల్లాలో స్కానింగ్ సెంటర్లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నాయి. ధనార్జనే ధ్యేయంగా ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నాయి. కొందరు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు కమిషన్లకు కక్కుర్తి పడి అవసరం ఉన్నా, లేకున్నా సిటీస్కాన్, అల్ట్రాసౌండ్ స్కాన్లకు రిఫర్ చేస్తున్నారు. జిల్లాలో అనుమతి లేని కొన్ని సెంటర్లలో స్కానింగ్ కేంద్రాల్లోనే ల్యాబులు నిర్వహిస్తున్నారు.

**గర్భిణుల పరీక్షలకే అనుమతి.....**

జిల్లాలో పలు స్కానింగ్ కేంద్రాలు అనుమతి లేకుండానే నడుస్తున్నాయి. కొన్నింటికి అనుమతులున్నాయి. స్కానింగ్ సెంటర్ నిర్వాహకులకు జనరల్ చెకప్ కు, అల్ట్రాసౌండ్ కు వేర్వేరు అనుమతులుంటాయి. గర్భిణుల స్కానింగ్ పరీక్షలకు ఫీజులు తక్కువగా ఉంటాయి. జనరల్ చెకప్ కు ఎక్కువ ఫీజులు ఉంటాయి. ఇదే అదనుగా పలువురు గర్భిణుల స్కానింగ్ కేంద్రాన్ని ఆసరాగా చేసుకొని అందులోనే జనరల్ పరీక్షలు చేస్తున్నారు.

**ధరల పట్టికలు లేవు..**

పలు డయాగ్నోస్టిక్ సెంటర్లలో ధరల పట్టికలు లేవు. ఉన్న వాటిలో ఆ ప్రదర్శన రేటు కన్నా పరీక్షలకు ఎక్కువ వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ నిర్దేశించిన దాని కంటే ఎక్కువగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు న్నాయి.కొన్ని కేంద్రాల్లో ఒక యంత్రానికి మాత్రమే అనుమతి ఉండగా రెండు యంత్రాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

**పలు కేంద్రాల్లో తప్పుడు రిపోర్టులు...**

జగిత్యాల జిల్లా కేంద్రంలోని పలు డయాగ్నోస్టిక్ సెంటర్లలో ఇచ్చే స్కాన్ రిపోర్టులు తప్పుగా ఉంటున్నాయని, మరోచోట స్కాన్ చేయిస్తే రిపోర్టు మరోలా వస్తున్నాయని, పలు కేంద్రాల్లో అర్హతలేని సిబ్బంది స్కానింగ్లు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇటీవలే ఓ రోగికి కిడ్నిలో రాయి ఉందని వైద్యుల సూచన మేరకు స్కానింగ్కు వెళ్తే అసలు కిడ్నీలో రాయి లేనట్లు రిపోర్టు ఇవ్వడంతో సదరు రోగి మరో స్కానింగ్ సెంటర్కు వెళ్లి స్కానింగ్ చేయించగా కిడ్నీలో 7.3మిల్లిమీటర్ల రాయి ఉన్నట్లు నిర్ధారించి రిపోర్టు ఇచ్చినట్లు,తప్పుడు రిపోర్టు ఇచ్చిన స్కానింగ్ సెంటర్పై సదరు రోగి కుటుంబసభ్యులు వైద్యారోగ్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.

**సిటీస్కాన్ తో అన్ని సమస్యలే.....**

అవసరం లేకున్నా సిటీస్కాన్ చేయించడం చాలా ముప్పు అని సీనియర్ వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల లాభం కంటే నష్టం ఎక్కువ ఉంటుందన్నారు. కొంతమంది వైద్యులు ప్రతి 3 రోజులకోసారి సిటీస్కాన్ చేయిస్తుంటారని, దీంతో రోగి శరీరం అధిక రేడియేషన్ గురి కావడంతో క్యాన్సర్ వచ్చే ప్రమాదముందని స్పష్టం చేస్తున్నారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారు మాత్రమే అది వైద్యులు సూచించే సిటీస్కాన్ చేయించుకొ వాలని చెబుతున్నారు. సిటీస్కాన్ కంటే బెటర్ ఎక్స్ రేతో ప్రాధాన్యత ఇవ్వాలని, అప్పటికీ జబ్బు పరిస్థితి తేలకపోతే సిటీస్కాన్ కు వెళ్లాలని సూచిస్తున్నారు. ఆక్సిజన్ లెవెల్స్ సాధారణంగా ఉన్న వారికి సిటీస్కాన్ అవసరం లేకున్నా కొందరు డాక్టర్లు కమిషన్ పై ఆశతో సిటీస్కాన్ లకు సిఫారసు చేస్తుండడం పట్ల రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### చేయూత పింఛన్లలో వృద్ధులు,

# బీడీ కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలి



**చురకలు ప్రతినిధి, కోరుట్ల, ఆగస్టు 10 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15వ తేదీ నుంచి కొత్త పింఛన్లను అందజేయనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో అర్హులైన వృద్ధులు బీడీ కార్మికులకు చేయూత పింఛన్లలో ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని కోరుట్ల నియోజకవర్గ తెలంగాణ రక్షణ సేన సీనియర్ నాయకుడు అజారుద్దీన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక సంవత్సరాలుగా బీడీ పరిశ్రమ పై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా వయస్సు మీదపడిన బీడీ కార్మికులు పని చేసే పరిస్థితుల్లో లేకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఇలాంటి వారికి ప్రభుత్వం అందించే పింఛన్ ఎంతో ఆసరాగా ఉంటు ందని తెలిపారు. ఈ నెల 15 నుంచి కొత్త పింఛన్ల పంపిణీ ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, వృద్ధాప్య, బీడీ కార్మికుల పింఛన్ల విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు వెలువడకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. కొత్త పింఛన్ల ప్రక్రియలో అర్హత ఉన్న వృద్ధులు బీడీ కార్మికులు ఎలాంటి కారణాలతోనూ నష్టపోకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

# రాష్ట్రపతి ఉత్తర్వులు మతస్వేచ్ఛకు గొడ్డలిపెట్టు

**-నగరంలో భారీ నిరసన ర్యాలీ**
**-దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలి : బిషప్ విజయ్ పాల్**



**చురకలు ప్రతినిధి,హనుమకొండ, ఆగస్టు 10 :** దళిత క్రైస్తవుల మత స్వేచ్ఛకు 1950 రాష్ట్రపతి ఉత్తర్వుల్లోని పారా 3 గొడ్డలిపెట్టుగా మారిందని, వెంటనే ఆ పారా 3ని సవరించి క్రైస్తవ మతాన్ని స్వీకరించిన దళితులను ఎస్సీలుగా గుర్తించాలని వరంగల్ క్యాథలిక్ బిషప్ విజయపాల్ డిమాండ్ చేశారు. సోమవారం హన్మకొండ సిబిసి చర్చి ప్రాంగణంలో భారీ శాంతి నిరసన ర్యాలీని బిషప్ విజయ్‌పాల్ ప్రారంభించారు.యునైటెడ్ వరంగల్ చర్చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన ర్యాలీకి ముందు బిషప్ మాట్లాడుతూ ఇతర మతాలను స్వీకరించిన దళితులకు ఎస్సీ హోదాను కొనసాగించిన కేంద్ర ప్రభుత్వం దళితులు క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే మాత్రం ఎస్సీ హోదా వర్తించదని చెప్పడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం దేశ పౌరులకు మత స్వేచ్ఛను ఇచ్చిందని, ఏ పౌరుడైనా ఏదైనా మతాన్ని స్వీకరించ వచ్చని పేర్కొందని, అలాంటప్పుడు దళితులు క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే ఎస్సీ హోదాను తొలగించడం ఎలా న్యాయమవుతుందని ప్రశ్నించారు. 1950 రాష్ట్రపతి ఉత్తర్వులోని పారా 3 దళిత క్రైస్తవుల మత స్వేచ్ఛను అడ్డుకుంటుందన్నారు.గత 76 ఏండ్లుగా దళిత క్రిష్టియన్లకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ సిబిసిఐతోపాటు అన్ని క్రైస్తవ సంఘాలు జాతీయస్థాయిలోఉద్యమిస్తున్నాయన్నారు. సిక్కు, బౌద్ధ మతాన్ని స్వీకరించిన దళితులకు కూడా గతంలో కేంద్ర ప్రభుత్వం ఎస్సీ హోదాను రద్దు చేసి, అనేక పోరాటాల నేపథ్యంలో వారికి ఎస్సీ హోదాను కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు.దేశంలో క్రైస్తవ మిషనరీలు దళిత, గిరిజన పేద వర్గాల కోసం అనేక మౌలిక వసతులను కల్పించారని, ఇప్పుడు ఎఫ్సిఆర్‌ఎ సవరణల బిల్లును పార్లమెంటులో పెట్టి ఆయా వర్గాలకు ఆర్ధిక ప్రయోజనాలు కలుగకుండా చేసే ప్రయత్నం చేస్తుందన్నారు.ఈ విషయంలో క్రైస్తవ సంస్థలు తమ నిరసనను కేంద్ర ప్రభుత్వానికి తెలియచేయడం జరిగిందన్నారు.ఈ ర్యాలీని విజయవంతం చేయడానికి వచ్చిన అన్ని క్రైస్తవ సంఘాలకు, విశ్వాసులకు బిషప్ అభినందనలు తెలిపారు.

**దళిత క్రైస్తవులకు మత స్వేచ్ఛ వద్దా..? పాస్టర్ కురియన్**

దళిత క్రైస్తవులకు మాత్రమే మత స్వేచ్ఛను అడ్డుకోవడమేంటని ట్రైసిటీ క్రిష్టియన్ ఫెలోషిప్(టిసిఎఫ్) అధ్యక్షులు పాస్టర్ కురియన్ ప్రశ్నించారు. సిక్కు, బౌద్ధ మతాలను స్వీకరించిన దళితులకు ఒక న్యాయం,క్రైస్తవ మతం స్వీకరించిన దళితులకు ఒక న్యాయమా ? ఇది ముమ్మాటికి దళిత క్రైస్తవుల మత స్వేచ్ఛను హరించడమేనన్నారు.దళిత క్రైస్తవుల దశాబ్దాల పోరాటాన్ని కేంద్ర ప్రభుత్వం అర్ధం చేసుకోవాలన్నారు.

**రంగనాథ్ మిశ్రా సిఫారసులను అమలు చేయాలి బిషప్ ఐజాక్**

క్రైస్తవ మతాన్ని స్వీకరించిన దళితుల స్థితిగతులు, ఆర్థిక పరిస్థితుల్లో ఎలాంటి మెరుగుదల లేదని, సామాజిక వివక్ష కొనసాగుతున్నందునా దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని రంగనాథ్‌మిశ్రా కమిషన్ చేసిన సిఫారసులను వెంటనే అమలు చేయాలని టిసిఎఫ్ ఛైర్మెన్ బిషప్ దామెర ఐజాక్ డిమాండ్ చేశారు. హన్మకొండ అంబేద్కర్ విగ్రహానికి పాస్టర్లు,సంఘ పెద్దలు పూలమాలలు వేశారు.అనంతరం వరంగల్ కలెక్టరేట్లో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణికి క్రైస్తవ నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు.హన్మకొండ కలెక్టరేట్లో డిఆర్డిఓ మేన శ్రీనుకు వినతిపత్రాన్ని అందచేశారు.ఈ నిరసన ర్యాలీలో వరంగల్ డయసీస్ ఎస్సీ కమిషన్ సెక్రటరీ ఫాదర్ మాచర్ల నవీన్, ఫాదర్ నమిండ్ల సురేందర్, వరంగల్ సిబిసి చర్చి పాస్టర్ పుల్ల బాజ్జీ, జన్ను పరంజ్యోతి, ఎంపి ఆనంద్ మోజెస్, మాజీ కార్పొరేటర్ బోడ డిన్న, పులి అనిల్కుమార్, పాస్టర్ మార్టిన్ లూథర్, హర్మోన్ బాప్టిస్టు చర్చి పాస్టర్ రాము, పాస్టర్ అశోక్ పాల్, వడ్డేపల్లి సీయోను ప్రార్థనా మందిరం పాస్టర్ దేవరాజ్, సిబిసి హన్మకొండ చర్చి అధ్యక్షులు క్రిష్టఫర్ రూబెన్, ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి విజయ్స్వరూప్, వరంగల్ సిబిసి చర్చి అధ్యక్షులు పోలెపాక మనోహర్, రుద్రారపు రాజ్మాహన్రావు, నల్లా జాన్సన్ ప్రసాద్, జన్ను ఈర్మియా, ఎస్సీ కమిషన్ సభ్యులు ల్యాదెళ్ల జాన్సన్, మేరీ సునీత, కలపాల ప్రవీణ్, కమలేశ్, తంగిరాల పాల్ తదితరులు పాల్గొన్నారు.



## హరిదాస్ నగర్‌లో
## అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవం




**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగష్టు 10 :** హరిదాస్ నగర్ గ్రామంలో సోమవారం అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిర్రం నాగరాజు యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, తల్లి మరియు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు పౌష్టికాహారం అత్యంత ముఖ్యమని తెలిపారు. గుడ్లు, బాలామృతం, ఇతర పౌష్టికాహార పదార్థాలు తల్లులకు, పిల్లలకు సమయానికి సరిగా అందేలా చూడాలని సూచించారు. చిన్నారుల శారీరక, మానసిక అభివృద్ధికి తల్లిపాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.అంగన్వాడీ టీచర్లు తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత, పౌష్టికాహారం,శిశు సంరక్షణపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, గర్భిణీలు,బాలింతలు,గ్రామంలోని తల్లులు పాల్గొన్నారు.

## కిషన్ దాస్‌పేటలో
## బోరు బావి త్రవ్వకాల ప్రారంభం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట, ఆగష్టు 10 :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని నాల్గవ వార్డులో కిషన్ దాస్‌పేట ప్రభుత్వ పాఠశాల సమీపంలో బోరు బావి త్రవ్వకాల పనులను సోమవారం గ్రామ సర్పంచ్ ఎలగందుల నర్సింలు ప్రారంభించారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ బోరు బావి ద్వారా స్థానిక ప్రజలకు తాగునీటి సమస్యకు కొంత మేర పరిష్కారం లభిస్తుందని సర్పంచ్ తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాల్‌రెడ్డి, వార్డు సభ్యులు ఆంజనేయులు, దోనుకుల రామచంద్రం, అంతర్పుల గోపాల్, మంజుల, చెన్నయ్య, మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజు, మేగి నరసయ్య, అల్లం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా పుట్టినరోజు వేడుకలు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఆగస్టు 10 :** ప్రముఖ యూట్యూబ్ డాన్సర్ మడి పోజు మానస పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆమె పుట్టినరోజు వేడుకలు కమాన్ పూర్ మండలం గుండారం రిజర్వాయర్ పైన జరిగాయి.ఆమె కేక్ కట్ చేయగా పలువురు కేక్ తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా దాసరి రామస్వామి, జబ్బార్ ఖాన్ వీర్ల ప్రశాంత్,కాంపల్లి రాజేష్,ఆసంపల్లి సౌమ్య,మడిపోజు మౌనిక, ధన్యవాదాలు తెలిపారు.

## బాధిత కుటుంబ సభ్యులకు మాజీ జెడ్పిటిసి పరామర్శ



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగస్టు 10 :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఉప్పుల నరసవ్వ అనారోగ్యంతో ఇటీవల మరణించారు.ఈ విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డిపేట మాజీ జెడ్పిటిసి సభ్యులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు చీటీలక్ష్మణరావు ఆయన సోదరుడు చీటి రామారావులు అనారోగ్యంతో మరణించిన ఉప్పుల నరసవ్వ భర్త ఉప్పుల నారాయణను వారి కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు.వారి వెంట బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఉప్పుల రాజంఉప్పుల చిన్న రాజం రాములు తదితరులు ఉన్నారు.

## ఆర్జీ 3 జిఎంను కలిసిన ఐఎన్టీయూసీ నాయకులు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఆగస్టు 10 :** సింగరేణి ఆర్జీ3 ఏరియా జనరల్ మేనేజర్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన తాల్లపల్లి లక్ష్మీపతి గౌడ్ ని ఐఎన్టియుసి కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో ఆర్జీ3 ఐఎన్టియుసి బృందం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసింది. జీఎం కి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి కొత్త బాధ్యతలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్జీ3 ఏరియా ఐఎన్టియుసి ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి తో కలిసి ఆర్జీ3 ఏరియాలోని ఓసీ1 ఉద్యోగులు ఎక్కువగా నివసిస్తున్న 8వ కాలనీకి సంబంధించిన పలు సమస్యలను జీఎం దృష్టికి తీసుకువచ్చారు. కాలనీలో తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు మరియు పారిశుద్ధ్య సమస్యలపై చర్చించారు. జీఎం అన్ని సమస్యలను సానుకూలంగా పరిశీలించి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ కార్యదర్శి ఏల్లంకి రామారావు, ఏరియా కార్యదర్శి శ్రీనివాసరావు, సలహాదారు జక్కుల దామోదర్ రావు, ఓసీ1 పిట్ కార్యదర్శి తోకల ప్రవీణ్ రెడ్డి, నాయకులు కాంతాల కిషన్ రెడ్డి, ఎం ప్రభాకర్ రెడ్డి, జి. నరేష్ కుమార్, చంద్రమౌళి, బుద్ధ సదానందం, షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఇప్పల నర్సింగాపూర్‌కు పాత్రికేయులు

**-జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై కేసు వేసిన కాంగ్రెస్ నేత గూడూరు స్వామి రెడ్డి**
**-స్వామి రెడ్డి ఇంటికి వెళ్లి గులాబీ పూలు అందజేసి నిరసన తెలుపనున్న పాత్రికేయులు**

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఆగస్టు 10 :** హుజురాబాద్ పాత్రికేయులు మంగళవారం ఇప్పల నర్సింగాపూర్ గ్రామానికి వెళ్ళనున్నారు. అక్కడ కాంగ్రెస్ నేత గూడూరు స్వామి రెడ్డిని కలిసి వారి కుటుంబ సభ్యులకు గులాబీ పూలను అందజేయనున్నారు. హుజురాబాద్ పాత్రికేయులకు గత ప్రభుత్వం స్థానిక కేసీ క్యాంప్లో నివాస స్థలాల పట్టాలను అందజేసింది. ఇందులో పాత్రికేయులు గృహాలు కూడా నిర్మించుకున్నారు. మున్సిపాలిటీ నుండి అన్ని అనుమతులు తీసుకొని పన్నులు కూడా చెల్లిస్తున్నారు. దీనిపై కాంగ్రెస్ నేత గూడూరు స్వామి రెడ్డి కేసు వేశారు. కేసును ఉపసంహరించుకోవాలని జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరుతూ పలుసార్లు స్థానిక కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్ ను పాత్రికేయులు కలిశారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో మరోసారి సమస్యపై ఆందోళనకు స్థానిక టీయూడబ్ల్యూజే ప్రెస్ క్లబ్ సన్నద్ధమైంది. జర్నలిస్టుల స్థలాలపై కేసు వేసిన కాంగ్రెస్ నేత గూడూరు స్వామి రెడ్డి ఇంటికి వెళ్లి గులాబీ పూలు అందజేయాలని ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కాయిత రాములు, కామణి రవీందర్ పిలుపునిచ్చారు. జర్నలిస్టులంతా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. నివేషణ స్థలాల సమస్య పరిష్కారం కోసం పూర్తిస్థాయి కార్యాచరణ అమలు చేస్తామని వారు ప్రకటించారు. కాగా పలు సంఘాలు జర్నలిస్టుల ఆందోళనకు మద్దతు ఇస్తున్నాయి.

## ఏకగ్రీవగా గ్రామ కమిటీ ఎన్నిక..



**చురకలు విలేఖరి వీణవంక ఆగస్టు 10 :** వీణవంక మండలం కనపర్తి నూతన గ్రామ శాఖ అధ్యక్షులుగా అల్లంపు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి,ఉపాఅధ్యక్షులుగా పులి మధునయ్య,పంజాల శ్రీకాంత్,ప్రధాన కార్యదర్శిగా అనుమండ్ల గోపాల్ రెడ్డి, కార్యదర్శిగా పర్లపల్లి వెంకటస్వామి, కోశాధికారిగా ఎల్కపల్లి ప్రశాంత్ కార్యవర్గ సభ్యులుగా ముంజ ప్రవీణ్, రామంచ పూర్ణ చందర్, మడ్డి తిరుపతి, ముత్యాల హుస్సేన్, అల్లంపు రెడ్డి సమ్మి రెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, నాయకులు సాహెబ్ హుస్సేన్, కొమ్మిడి రాకేష్ రెడ్డి, మేకల ఎల్లారెడ్డి, డైరెక్టర్, శ్రీపతి రెడ్డి పల్లెర్ల కిరణ్,పత్తి సమ్మిరెడ్డి ఉన్నారు.

## ప్రైమ్ ల్యాబ్ క్లినికల్ లాబొరేటరీ ప్రారంభం



**చురకలు ప్రతినిధి,నిర్మల్, ఆగస్టు, 10 :** ఈ రోజు నిర్మల్ పట్టణంలోని ఎలక్ట్రిసిటీ ఆఫీస్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ప్రైమ్ ల్యాబ్ క్లినికల్ లాబొరేటరీని మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ల్యాబొరేటరీ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య పరీక్షలు అందుబాటులోకి రావడం అభినందనీయమని అన్నారు. ఈ ల్యాబొరేటరీ ద్వారా నిర్మల్ పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య పరీక్షలు, సేవలు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జకి, గోపు.గోపీ, ఎస్పీ.రాజు, ఇమ్రానుల్లా, రఫీ, జాకీర్, కత్తి నరేందర్,ఇర్ఫాన్, సాకీర్ మరియు అజార్ సాబ్, అమీర్ సాబ్, హస్మాత్, బాదర్, యూనుస్, అషు, అల్తాఫ్,పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### మిడ్ మ్యానేర్ బ్యాక్ వాటర్‌కి వచ్చే

# పర్యాటకుల భద్రతకు చర్యలు

**-పర్యాటకులు పోలీస్ వారి సూచనలు, హెచ్చరికలు తప్పనిసరిగా పాటించాలి**
**-మిడ్ మ్యానేర్ బ్యాక్ వాటర్ ను సందర్శించిన జిల్లా ఎస్పీ**



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట ఆగస్టు 10 :** తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లి గ్రామ శివారులోని మిడ్ మ్యానేర్ బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని ఈరోజు జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే పోలీసు అధికారులతో కలిసి సందర్శించారు.బ్యాక్ వాటర్ ప్రాంతంలో పర్యాటకుల భద్రత కోసం చేపడుతున్న చర్యలను పరిశీలించారు. పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.బ్యాక్ వాటర్ పరిసరాల్లోని ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, పర్యాటకులు ఆయా ప్రాంతాలకు వెళ్లకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా చిన్నారులు, కుటుంబాలతో వచ్చే పర్యాటకుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశించారు.పర్యాటకులు పోలీసుల సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని, నీటి ప్రాంతాలకు దూరంగా ఉండాలని, ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, సరదా విషాదంగా మారకుండా చూసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు.ఎస్పీ వెంట డీఎస్పీ నాగేంద్రచారి, సిబ్బంది ఉన్నారు.

# ముగ్గురు హెడ్ కానిస్టేబుల్స్‌కు ఏఎస్సైలుగా పదోన్నతి

**-అభినందించిన ఎస్పీ జానకి షర్మిల**

**చురకలు ప్రతినిధి,నిర్మల్,ఆగష్టు, 10 :** నిర్మల్ జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న 1990 బ్యాచ్‌కు చెందిన ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లకు అసిస్టెంట్ సబ్-ఇన్‌స్పెక్టర్ లుగా పదోన్నతి లభించింది. పదోన్నతి పొందిన వారిలో హెడ్ కానిస్టేబుల్ 1285 ఎస్.ఎస్.చంద్రప్రకాష్ - మామడ పోలీస్ స్టేషన్, హెచ్.సి. 547 ఎస్. చంద్రశేఖర్- నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్, హెచ్ సి 448 ఏ. సాయన్న-సోన్ పోలీస్ స్టేషన్ ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ.జానకి షర్మిల పదోన్నతి పొందిన సిబ్బందిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ శాఖలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందించిన సేవలను ఎస్పీ అభినందించారు. పదోన్నతి సిబ్బంది కృషి, అంకిత భావానికి గుర్తింపుగా భావించాలని, నూతన హోదాలో మరింత బాధ్యతతో విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకం గా వ్యవహరిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. క్రమశిక్షణ,



నిజాయితీ,అంకితభావం, బాధ్యతాయుతమైన విధి నిర్వహణతో నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భైంసా అడిషనల్ ఎస్పీ.సాయి కిరణ్ పాల్గొని పదోన్నతి పొందిన సిబ్బందిని అభినందించారు

# శివపరాశక్తి పీఠంలో ఘనంగా శివయ్యకు అభిషేకాలు

**-భక్తులను ఆశీర్వదించిన పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ మనోహర్ రాజు**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగస్టు 10 :** పవిత్ర సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని శివపరాశక్తి పీఠంలో పరమశివునికి విశేష పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. మహాదేవుని దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శివయ్య కృపకు పాత్రులయ్యారు. ప్రాంగణమంతా శివనామ స్మరణతో మార్మోగింది.








**కన్నుల పండువగా అభిషేకాలు:** సోమవారం సందర్భంగా పీఠంలో కొలువైన శివయ్యకు తాంత్రిక పూజ విధానంతో పంచామృతాలతో ఘనంగా మహా అభిషేకం నిర్వహించారు. స్వామి వారికి గంధం, భస్మంతో చేసిన విశేష భస్మాభిషేకాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అభిషేక,అలంకరణ కార్యక్రమాల అనంతరం స్వామివారికి మహా సప్తహారతులు కన్నుల పండువగా సమర్పించారు.ఈ పవిత్ర కార్యక్రమాన్ని వీక్షించి తరించడానికి భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. పూజా కార్యక్రమాలు, హారతుల అనంతరం విచ్చేసిన భక్తులందరికీ పీఠం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో శివపరాశక్తి పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ మనోహర్ రాజు గారు స్వామివారి దర్శనార్థం విచ్చేసిన భక్తులందరినీ వారు ఆశీర్వదించి, శివయ్య కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ అందరిపై ఉండాలని ప్రార్థించారు.

# శివాలయాలలో భక్తుల పూజలు

**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం అగష్టు (10) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని గోదుర్, వేములకుర్తి,తిమ్మాపూర్, యామపుర్,ఎర్దండి, వర్షకోండ, ఇబ్రహింపట్నం, అమ్మకపేట్ తదితర గ్రామలలో సోమవారం అశడమాసం చివరి సోమవారం సందర్భంగా సమిపం లోని గోదావరి నదిలో



పుణ్యస్నానాలు చేసి భక్తులు ప్రత్యేక



పుజలు నిర్వహించారు. అర్చకుల అధ్వర్యంలో స్వామి వారికి పంచామృత అభిషేకం, అష్టోత్తర అర్చన పుజలు నిర్వహించి భక్తులకు తిర్దప్రసాధ వితరణ చేశారు.ఈకార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

**-తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లెల్లల బాలకృష్ణ**
**-జగిత్యాలలో జైల్ బరో పేరుతో ఆందోళన**




చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 10: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ఎండ గట్టాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి,సీపీఎం జిల్లా ఇంచార్జి లెల్లల బాలకృష్ణ పిలుపు నిచ్చారు.కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పోరేట్ సంస్థలకు అండగా ఉంటూ కార్మిక,రైతు, ప్రజలకు వ్యతిరేకంగా పనిచేస్తుందని ఆరోపిస్తూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్ స్టాండ్ చౌరస్తాలో జైల్ బరో నిరసన కార్యక్రమాన్ని సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆద్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. నాయకుల ధర్నాను పోలీసులు అడ్డుకుని అరెస్టులు చేసి ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా ఇంచార్జి బాలకృష్ణ, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, ఐఎఫ్టి యూ జిల్లా కార్యదర్శి చింత భూమేశ్వర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు ఇందూరి సులోచనలు మాట్లాడుతూ అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం,ఐకెపి వివోఏ, ఫీల్డ్ అసిస్టెంట్, ఆరోగ్య శాఖలో వివిధ స్కీంలో కోటి మంది వర్కర్లు పని చేస్తున్నా నేటికి ఉద్యోగ భద్రత, కనీస వేతనానికి నోచుకోలేదన్నారు.కార్మికుల హక్కులను కాలరా స్తూ కేంద్రం తీసుకవచ్చిన నాలుగు లేబర్ కొడులను తక్షణమే రద్దు చేయాలన్నారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరలు అమలు చేయక పోవడంతో ఏటా రూ.4 లక్షల కోట్లు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార భద్రతా చట్టానికి కేంద్ర తూట్లు పొడిచి అంత్యోదయ పథకం ద్వారా నిరుపేదలకు 35 కిలోల బియ్యాన్ని రద్దు చేసి ఒక్కో మనిషికి 7 కేజీల బియ్యాన్ని మాత్రమే ఇస్తుందని మండిపడ్డారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని దీన్ని నిలువరించేందుకు ప్రజలు ఆందోళనలకు సిద్దంగా ఉండలన్నారు. ఇప్పటికయినా కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని హితవు పలికారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోమటి శేఖర్,సీపీఎం జిల్లా నాయకుడు భూతం సారంగ పాణి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాయిని శారద, నాయకులు జంగిలి ఎల్లయ్య, మాల్యాల సురేష్, వెల్మలపల్లి వేంకట చారి తదితరులు ఉన్నారు.

# "ట్రాన్స్" ఫార్మర్ ల భారం రైతులకే...?

**- కాలిన ట్రాన్స్‌ఫార్మర్ ల రవాణాకు రైతులే ఖర్చు**
**- ట్రాక్టర్లతో ఎగుమతి, దిగుమతి చేయాల్సిన దుస్థితి**
**- సిబ్బంది కొరతతో మరింతగా జాప్యం**




**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఆగస్టు (10) :** వ్యవసాయ రంగానికి వెన్నెముకగా నిలిచే విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు రైతులకు వరం కావాల్సింది పోయి భారంగా మారుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినా, సాంకేతిక లోపం తలెత్తినా దానిని మరమ్మతుల కేంద్రానికి తరలించడం నుంచి తిరిగి పొలాల వద్ద అమర్చడం వరకు అయ్యే ఖర్చు మొత్తం రైతుల భుజాలపై పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఖరీఫ్ సాగులో వందలాదిమంది రైతులు వ్యవసాయంలో బాగంగా వరి, మొక్కజొన్న,పసుపు,సోయాబీన్ తదితర పంటలకు సాగునీరు అందించడంలో ట్రాన్స్ ఫార్మర్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయి.వర్షాకాలంలో విద్యుత్ లోడ్లు పెరగడం, పాతబడిన పరికరాలు, సాంకేతిక లోపాలు వంటి కారణాలతో ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ కాలిపోతున్నా యని రైతులు వాపోతున్నారు.జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని గోదుర్, తిమ్మాపూర్, తిమ్మాపూర్ తండ,యామపుర్, ఫకిర్ కోండాపుర్, వేములకుర్తి, బర్దిపుర్, ములరాంపుర్, ఎర్దండి, కోమటికోండాపుర్, వర్షకోండ, డబ్బ, ఎర్రాపుర్, అమ్మకపేట్, ఇబ్రహింపట్నం, కేశాపుర్, కోజన్ కోత్తుర్ 17 గ్రామాల్లో రైతులకు వ్యవసాయ విద్యుత్ అందించేందుకు సుమారు 1,200ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి.దాదాపు 7వేల మంది రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పొందారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయిన పృుడు వాటిని మరమ్మతుల కోసం తరలించడం, కొత్తవి తీసుకురావడం కోసం రైతులే ట్రాక్టర్లకు డబ్బులు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.విధ్యుత్‌శాఖలో మండలంలో సిబ్బంది కొరతకారణంగా ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు ఆలస్యమవుతుండటంతో పంటలకు నీరందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు సంబదిత అదికారులకు సమాచారం ఇచ్చి విధ్యుత్ శాఖ వాహనం ఎప్పుడు వస్తోందో అనే నిరిక్షిచకుండ సబదిత కార్యలయం కు ఎగుమతి చేసి,దిగుమతి చెసుకుంటు న్నారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో వెంటనే కొత్తవి ఏర్పాటు చేసి, అదనపు సిబ్బందిని నియమించాలని రైతులు కోరుతున్నారు.

**సంఘుల అధ్వర్యంలో ట్రాక్టర్లతోనే రవాణా...**

ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోగానే దానిని విద్యుత్ శాఖ మరమ్మతుల కేంద్రానికి తరలించాల్సి ఉంటుంది.అయితే శాఖ వద్ద సరిపడా వాహనాలు లేకపోవడం తో రైతులే ట్రాక్టర్లు లేదా ఇతర ప్రైవేట్ వాహనాలను అద్దెకు తీసుకొని రవాణా చేయాల్సి వస్తోంది.మరమ్మతులు పూర్తయిన తర్వాత తిరిగి పొలాల వద్దకుతీసుకువచ్చి అమర్చడానికి కూడా రైతుసంఘులుఖర్చుభరించాల్సి వస్తోంది.

**తప్పని వేల రూపాయల భారం...**

ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించడానికి దూరాన్ని బట్టి వేల రూపాయలు ఖర్చవుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే ఎరువులు, విత్తనాలు, కూలీల ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ అదనపు భారం మరింత కష్టంగా మారిందని అంటున్నారు. కొన్నిసార్లు రైతులు కలిసి చందాలు వేసుకొని ట్రాన్స్‌ఫార్మర్లను తరలించే పరిస్థితి నెలకొంది.

**కాలిన ట్రాన్స్ ఫార్మర్ లతో పంటల పై ప్రభావం...**

ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు నీటిని సమయానికి అందించకపోతే దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని రైతులు చేసెది ఎమిలేక,సిబ్బంది సమాచారం అందించి ట్రాన్స్‌ఫార్మర్ ను ప్రత్యేక వాహనాలలో తరలించి వెంటనే కాలిన ట్రాన్స్ఫార్మర్ స్దానం మరోకటి తెచ్చి సిబ్బంది సహకారం తో అమర్చుకోని నీటి సరఫరా చెసుకుంటున్నారు.

**తిమ్మాపూర్ లో రెండు కాలిన రెండు ట్రాన్స్ఫార్మర్ లు ....**

మండలం లోని తిమ్మాపూర్ గ్రామంలో సోమవారం గ్రామ శివారులోని మామిడి బాగుల ప్రాతం లోని 63 హెచ్ పి,ముక్కిడి పోశమ్మ ప్రాతంలో ని 25 హెచ్ పి ట్రాన్స్ఫార్మర్లు ఖాళీపోగా విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించారు.విద్యుత్ శాఖ వాహనాలు అందుబాటులో లేకపోవడం తో చేసేదేమీ లేక రైతుసంఘాల ఆధ్వర్యంలో వేరువేరుగా ప్రైవేట్ ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకొని రైతులే కార్యాలయం తరలించి వారి పంటల రక్షణకోసం మరోట్రాన్స్ఫర్లను తెచ్చు కొవటం జరిగిందని రైతులు తెలిపారు.

**విధ్యుత్‌శాఖ అదికారులు స్పందించాలి**

**కాటిపెల్లి సుధకర్- రైతు తిమ్మాపూర్**

రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల రవాణా బాధ్యతను విద్యుత్ శాఖే స్వీకరించాలి, మండల స్థాయిలో ప్రత్యేక వాహనాలను అందుబాటులో ఉంచాలి. రైతులు పంటల రక్షణ కోసం డబ్బులు పెట్టుకుని మరి రవాభారం మెస్తున్నాం, ఖాళీ పోస్టులను భర్తీ చేసి సిబ్బంది సంఖ్యను పెంచాలని, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను త్వరితగతిన మరమ్మతు చేసి రైతులకు అందించాలి.

**వాహనాలు అందుబాటులో ఉంచాం**

**శ్రీరాముల సతీష్-ఏఈ ఇబ్రహీంపట్నం**

మండలం నుండి 17 గ్రామాలలో రైతులకు విద్యుత్ సరఫరాలో కాలిపోతున్న ట్రాన్స్ఫార్మర్ల తరలింపు కోసం అందుబాటులో వాహనాలు ఉన్నాయి. సమయ భావం వల్ల వేరే ప్రాంతాల నుండి కాలిన ట్రాన్స్ఫార్మర్లు తెచ్చేందుకు వాహనాలు వేల్లగా, రైతులు పంటల రక్షణ కోసం ట్రాక్టర్ల పైన ట్రాన్స్ఫార్మర్లు తెచ్చారు. మరికొన్ని వాహనాలు ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెల్దాం.



## ఎల్లారెడ్డిపేటలో 12న ఉచిత నేత్ర వైద్య శిబిరం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగష్టు 10 :** ఎల్లారెడ్డిపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆగస్టు 12, బుధవారం ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి, సిరిసిల్ల వారి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ ఏ. నర్సింలు తెలిపారు.ఈ శిబిరంలో గ్రామ ప్రజలు, రైతులు మరియు అన్ని వర్గాల వారు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ముఖ్యంగా కంటి లోపల మోతిబిందు (క్యాటరాక్ట్) మరియు శుక్లాలు ఉన్నవారిని పరీక్షించి,అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు .శిబిరానికి వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు మరియు ఫోన్ నంబర్ తీసుకురావాలని సర్పంచ్ సూచించారు. ఉచిత వైద్య సేవలను గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున వినియోగించుకోవాలని పంచాయతీ వర్గాలు విజ్ఞప్తి చేశాయి.

## సత్సంగ సధనం చేరిన 'శ్రీరామ హృదయ' కలశం"



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట ఆగష్టు 10 :** ఎల్లారెడ్డిపేట మండలంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయం నుండి సత్సంగ సదనానికి "శ్రీరామ హృదయం" కలశం భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తనతో చేరింది ఏకాదశి సందర్భంగా శ్రీశ్రీశ్రీ సరస్వతి గోవిందరాజుల చారి ట్రబుల్ ట్రస్ట్ సత్సంగ సదనం అధ్యక్షులు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి ప్రవచనాలు చేశారు. శ్రీరామచంద్రుడిని హృదయంలో నిలుపుకొని ఆయన ఆదర్శాలను ఆచరించాలనే సందేశాన్ని భక్తులకు లక్ష్మారెడ్డి వివరించారు.ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీరామ హృదయ కలశమును రామ నామ సంకీర్తనతో భక్తిశ్రద్ధలతో భక్తులంతా కలిసి శ్రీవిష్ణుసహస్రనామ పారాయణం చేశారు.మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న ఆలయ కమిటీల ఆహ్వానం మేరకు శ్రీరామ హృదయ కలశం తీసుకొని హిందూ ప్రచారాన్ని విస్తృత పరుస్తామని తెలిపారు.ఇంటింటా ప్రవచనాలు చేయాలని వికాస తరంగిణి గోదాగోష్టిభక్త బృందంవారు నిర్ణయించారు.ఈ సందర్భంగా పాల్గొన్న భక్తకోటికి లక్ష్మారెడ్డి తీర్థప్రసాదాలను వితరణ చేశారు.



# పేదలకు అండ సెంటినరీ కాలనీ లైన్స్ క్లబ్

**-సేవే లక్ష్యం... సమాజమే కుటుంబం**
**-ప్రజాసేవలో నిమగ్నం లైన్స్ క్లబ్ సభ్యులు**
**-లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ అధ్యక్షుడిగా లయన్ మేకల మారుతి యాదవ్ సేవా ప్రస్థానం**
**-ఒక సంవత్సరం... వేలాది మందికి సేవలు... 11 ప్రతిష్ఠాత్మక అవార్డులు**








**జబ్బార్ ఖాన్,చురకలు ప్రతినిధి, కమాన్ పూర్,పెద్దపల్లి జిల్లా :** సేవా కార్యక్రమాలకు కొత్త నిర్వచనం చెబుతూ,నిరుపేదలు,విద్యార్థులు, మహిళలు,వృద్ధులు,ఆరోగ్య అవసరాలు ఉన్న ప్రజలకు అండగా నిలిచిన లయన్స్‌క్లబ్‌ఆఫ్ సెంటినరీకాలనీ అధ్యక్షుడిగా లయన్ మేకల మారుతి యాదవ్ 2025-26 సంవత్సరంలో విశేష సేవలు అందించారు. అధ్యక్షుడిగా తన ఒక సంవత్సరం పదవీకాలంలో క్లబ్‌ను సేవాకార్యక్రమాల్లో ముందుండేలా నడిపిస్తూ,సుమారు 7,300 మంది లబ్ధిదారులకు వివిధ రూపాల్లో సేవలు అందించారు.

**నేత్రదానం - మానవత్వానికి ప్రతీక**

మారుతి యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో 23 మంది నేత్రదానానికిముందుకు రావడం ప్రత్యేకంగా నిలిచింది. మరణానంతరం కూడా ఇతరులకుచూపును అందించేలా ప్రజల్లో నేత్రదానంపై అవగాహన కల్పించడం ద్వారా మానవతా విలువలను చాటిచెప్పారు.

**500 మందికి పైగా ఉచిత కంటి ఆపరేషన్లు**

పేద ప్రజలకు కంటి వైద్యం అందించాలనే లక్ష్యంతో రేకుర్తి ఆసుపత్రి వైస్ చైర్మన్ చిదుర సురేష్ గారి సహకారంతో 500మందికి పైగా పేదలకు ఉచిత కంటిపరీక్షలు, అవసరమైన శస్త్రచికిత్సలు మరియు ఇతర వైద్య సౌకర్యాలు అందేలా కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్థిక స్థోమత లేని కుటుంబాలకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారింది.

**1,500 మందికి ఉచిత డయాబెటిక్ పరీక్షలు**

మధుమేహంపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు ముందస్తు పరీక్షల ప్రాధాన్యతను తెలియజేస్తూ సుమారు 1,500 మందికి ఉచిత డయాబెటిక్ చెక్‌అప్‌లు నిర్వహించారు.ఆరోగ్య పరిరక్షణను సేవా కార్యక్రమాల్లో ప్రధాన అంశంగా మార్చారు.

**పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా రామగిరి కోట పరిసరాల్లో సుమారు 1,000 సీడ్ బాల్స్ (విత్తనపు బంతులు) వేయడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. భవిష్యత్ తరాలకు పచ్చని వాతావరణం అందించాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.

**80 నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు**

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 80 కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేసి, ఆపదలో ఉన్న కుటుంబాలకు క్లబ్ అండగా నిలిచింది. సేవా కార్యక్రమాల్లో 'అవసరమైన వారికి అవసరమైన సమయంలో సహాయం' అనే విధానాన్ని అమలు చేశారు.

**క్లబ్ బలోపేతానికి సభ్యత్వ విస్తరణ**

సేవా కార్యక్రమాలతో పాటు లయన్స్ క్లబ్‌ను మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేసి 10 మంది కొత్త సభ్యులను క్లబ్‌లో చేర్పించారు.తద్వారా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు బలమైన సేవా బృందాన్ని నిర్మించారు.

**ఒకే ఏడాదిలో 11 ప్రతిష్ఠాత్మక అవార్డులు**

మేకల మారుతియాదవ్ అందించిన సేవలకు గుర్తింపుగా మొత్తం 11 అవార్డులు లభించాయి.ఇందులో బెస్ట్ ప్రెసిడెంట్,హంగర్ రిలీఫ్, ఎన్విరాన్‌మెంట్, డయాబెటిక్, విజన్ యాక్టివిటీ తదితర విభాగాల్లో అవార్డులు ఉన్నాయి. ఈ అవార్డులను లయన్స్ జిల్లా గవర్నర్ లయన్ సింగరాజు కొండండ రాములు చేతుల మీదుగా అందుకోవడం విశేషం. అలాగే క్లబ్ హెల్త్ గ్రాఫ్‌ను మెరుగు పరచడంలో చేసిన కృషికి గుర్తింపుగా లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబూరావు ప్రతిష్ఠాత్మకమైన లయన్స్ ఫౌండర్ మెల్విన్ జోన్స్ మెడల్ అందజేశారు.

**విజయానికి బలమైన టీమ్**

అధ్యక్షుడిగా మేకల మారుతి యాదవ్‌కు క్లబ్‌ముఖ్యసభ్యుల సహకారం కీలకంగా నిలిచింది.గంట వెంకట రమణ రెడ్డి, మొల్మూరి శ్రీనివాస్, డా. శరణ్య యాదవ్, అబ్బు కేశవ రెడ్డి, టీవీ సురేష్ బాబు,కొప్పుల శ్రీపాద రావు, కదిరి కళాధర్ రెడ్డి,దొడ్ల శ్రీనివాస్, మిరియాల రాజిరెడ్డి,గుండేటి సత్యనారాయణ,దుబ్బాక సత్య రెడ్డి, బెల్లం శ్రీను తదితర సభ్యులు ఆయనతో కలిసి సేవా కార్యక్రమాలను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారు.

**అధ్యక్ష పదవీకాలం అనంతరం జిల్లా స్థాయిలో కీలక బాధ్యత**

ఒక సంవత్సరం విజయవంతమైన అధ్యక్ష పదవీకాలానికి కొనసాగింపుగా మేకల మారుతి యాదవ్‌కు మరో కీలక బాధ్యత లభించింది.2026-27 సంవత్సరానికి జిల్లా గవర్నర్ లయన్ మోర భద్రేశం లయన్ మేకల మారుతి యాదవ్‌ను లయన్స్ జిల్లా 320+లో "హంగర్ రిలీఫ్" విభాగానికి జిల్లా చైర్‌పర్సన్‌గా నియమించారు.క్లబ్ స్థాయిలో చేసిన సేవలను జిల్లా స్థాయిలో మరింత విస్తరించేందుకు ఈ బాధ్యత ఒక గొప్ప అవకాశంగా నిలిచింది.

**సేవా ప్రస్థానానికి కొనసాగింపే కొత్త లక్ష్యం**

అధ్యక్షుడిగా ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న మేకల మారుతి యాదవ్ ప్రయాణం ఒక పదవీకాలంతో ముగియలేదు. "పదవి కోసం సేవ కాదు... సేవ చేయడానికి పదవి ఒక అవకాశం" అనే భావనతో ముందుకు సాగుతూ, క్లబ్‌ను మరింత బలోపేతం చేయడం, నిరుపేదలకు మరింత సహాయం అందించడం, ఆరోగ్యం-ఆకలి-పర్యావరణం-నేత్ర సంరక్షణ రంగాల్లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టడమే తన లక్ష్యంగా కొనసాగిస్తున్నారు.ఒక సంవత్సరం అధ్యక్ష పదవీకాలం... 7,300 మందికి పైగా లబ్ధిదారులు... 23 నేత్రదానాలు... 500 మందికి పైగా ఉచిత కంటి ఆపరేషన్లు... 1,500 మందికి డయాబెటిక్ పరీక్షలు... 1,000 సీడ్ బాల్స్... 80 కుటుంబాలకు నిత్యావసర సరుకులు... 10 మంది నూతన సభ్యులు... 11 అవార్డులు...ఇవన్నీ కలిపి చూస్తే, లయన్ మేకల మారుతి యాదవ్ అధ్యక్ష పదవీకాలం లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ సేవా చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచింది.








# 'చేయూత'పై ఆశలు



**-వృద్ధాప్య, బీడీ కార్మికులకు నిరాశయే**
**-దరఖాస్తుల స్వీకారణకు పచ్చ జెండా**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 10 :** ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న చేయూత పింఛన్లు మంజూరుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది.ఆగస్టు 15 నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించగా,మండల,మున్సిపల్ స్థాయి అధికారులు కొత్తగా అందించనున్న చేయూత పింఛన్లకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రకటనలు చేస్తున్నారు.తాజాగా సెర్ఫ్ సీఈఓ దివ్య రాజన్ హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల డిఆర్‌డిఓలు,ఎంపీడిఓలు, పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పింఛన్లు మంజూరు పై దిశా నిర్దేశం చేశారు.కొత్త వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ,అర్హతలు,నిబంధనలు వివరించారు. మండలాల్లో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశాలు జారీ అయినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఈ సారి వృద్ధులకు, బీడీ కార్మికులపింఛన్ దరఖాస్తుకు అవకాశం లేక పోవడంతో వారు నిరాశ కు గురవుతున్నారు. వృద్ధుల విషయం లో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ జిల్లా కేంద్రం లో ఆదివారం వృద్ధుల సమావేశంలో మాట్లాడు తూ 2021 లో అప్పటి ముఖ్య మంత్రి కే సీ ఆర్ 2021 ఆగస్టు నుంచే 57 ఏళ్ళు నిండిన వారికి పింఛన్లు అందజేస్తామని ప్రకటించడంతో అర్హులు మీ సేవా కేంద్రాల్లో, ఎంపీ డివో, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు లు సమర్పించారని, ఇందులో కేవలం 20 శాతం మాత్రమే మంజూరు కాగా మిగిలిన 80 శాతం దరఖాస్తు చేసుకున్న వారు ఇప్పటికీ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే చేయూత పథకం కింద పింఛన్లు మంజూరు అవుతాయాని ఎంతో ఆశ తో ఎదురు చూస్తున్న పరిస్థితుల్లో ఈ సారి వృద్ధులకు అవకాశం లేకపోవడం పట్ల తమ అసోసియేషన్ పక్షాన ఆందోళన వ్యక్తం చేస్తూ వృద్ధుల కు అవకాశం కల్పించాలని రాష్ట్ర సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు వినతిపత్రం సమర్పించారు.

**కొత్త గా పింఛన్ల మంజూరుకు అర్హతలు.. నిబంధనలు.....**

ఒంటరి మహిళలు ,వితంతువులు,గీత, చేనేత కార్మికులు, బోధ కాలు, డయాలసిస్ రోగులు, వికలాంగులకు కొత్త గా పింఛన్లు మంజూరు చేయనున్నారు.దివ్యంగుల్లో తలసేమియా,సికిల్ సెల్,హిమోఫిలియా తో భాద పడుతున్న వారికి ప్రాధాన్యత క్రమం లో మంజూరు చేస్తారు. ఎక్కడికక్కడే ప్రత్యేక సిబ్బంది ప్రభుత్వ వెబ్ సైట్ లో వివరాలు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అనంతరం మున్సిపల్ కమీషనర్లు, ఎం పి డివోలు క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారు. 360 డిగ్రీ ల డేటాబేస్ తో ఇటీ వల జరిగిన సామాజిక, ఆర్థిక, కులగణన డేటా తో సరి పోల్చి అర్హులను గుర్తించి ఆన్ లైన్ ద్వారా డీ ఆర్ డీవో కు పంపిస్తారు.ఇదే కాకుండా గీత కార్మికులు దరఖాస్తు చేసుకుంటే ఆ వివరాలును అబ్కారీ శాఖకు పంపించనున్నారు.చేనేత కార్మికులు అయితే హ్యాండ్ లూం,టెక్స్ టైల్స్ శాఖకు పంపించి అర్హులను గుర్తిస్తారు. ఫైనల్‌గా దరఖాస్తులను ఆయా విభాగలతో సమన్వయం చేసుకొని అర్హులైన వారి జాబితా సిద్ధం చేసి మంజూరు కోసం కలెక్టర్ ఆమోదంతో ప్రభుత్వంకు నివేదించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

